విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com కర్నూలు, శుక్రవారం 9, మే 2025

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : ముఖ్యమంత్రి పర్యటన కోసం పటిష్టమైన ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, గ్రామ సభకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఏర్పాట్లు ఎంతవరకు పూర్తయ్యాయి, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే పనులన్నింటిని పరిశీలించడానికి వస్తున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలన్నారు. హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, ప్రజావేదిక సభకు సంబంధించి ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో సిఎంఓ కార్యాలయం అధికారులు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-ఉరవకొండ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9న శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా గురువారం వజ్రకరూరు మండలం ఛాయా పురం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, గ్రామ సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

కాన్వాయ్ రిహార్సల్

విశాలాంధ్ర,-ఉరవకొండ: ఛాయాపురం పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బందోబస్తు నేపథ్యంలో గురువారం కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షణలో కేటాయించిన ప్రదేశాలలో పోలీసు సిబ్బంది, అధికారులు ఉంటూ పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలు, ఆయా మార్గాల గుండా కాన్వాయ్ కొనసాగింది. హెలిప్యాడ్ వద్ద వి.వి.ఐ.పి దిగింది మొదలు తిరిగి బయలుదేరేంత వరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఎలా బందోబస్తు, విధులు నిర్వర్తించాలో, భద్రత ఎలా చేపట్టాలో, కాన్వాయ్ ఎలా సాగాలో రిహార్సల్ చేశారు. కలెక్టర్, ఎస్పీలతో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అదనపు ఎస్పీలు డి.వి.రమణ మూర్తి, ఇలియాజ్ బాషా, డీఎస్పీలు, సి.ఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈనెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వజ్రకరూరు మండలం ఛాయాపురంలో హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, ప్రజావేదిక సభ ఏర్పాట్లను పరిశీలించారు.

భూ సమస్యల పరిష్కారంపై విఫలమైన ప్రభుత్వం

సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలో భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం విఫలమైందని సిపిఐ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలోని ఆర్డిటి స్కూల్‌లో బండారు శివ ఆధ్వర్యంలో గురువారం సిపిఐ ఆత్మకూరు మండల సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి రామకృష్ణ, నియోజవర్గం సహాయ కార్య దర్శి జి శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో భూ సమస్యలు చాలా ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకొని సమస్య పరిష్కారం చేయలేదన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలపైన సీపీఐ ఉవ్వెత్తున పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజా శ్రేయస్సే సిపిఐ లక్ష్యం అన్నారు. బడుగు,బలహీన, అట్టడుగు వర్గాల హక్కుల కోసం ఉద్యమిస్తూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఘనత కేవలం సిపిఐ పార్టీకి చెందుతుందన్నారు. విద్యార్థి యువజన సమస్యలు, రైతులు, కూలీలు, కార్మికులు సమస్యలపై నిరంతరం ప్రభుత్వాలను అధికారులను ప్రశ్నిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాలపైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉద్యమాలు చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ తీవ్రతను తగ్గించాలని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని దేశవ్యాప్తంగా ఆందోళనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఈ వక్ఫ్ బోర్డు మైనార్టీ సమస్యలు తీర్చడంలో ముందుండి పోరాడుతామని తెలిపారు... ఈ కార్యక్రమంలో సిపిఐ ఆత్మకూరు మండల కార్యదర్శి నీళ్లపాల రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి బి రామాంజనేయులు, సిపిఐ మండల నాయకులు ఓబులేసు, గోపాల్ నాయక్, గోవిందు, హెచ్.తాతయ్య, సి.రాముడు, కార్యకర్తలు తులసి నాయక్, మల్లికార్జున, తొలిసే నాయక్, హరి కృష్ణ, నరసింహులు, ముత్యాలు, సర్దానీ, లక్ష్మీదేవి, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

విశాలాంధ్ర-రాప్తాడు : ఆధునిక యుగంలో సమాజం అభివృద్ధి చెందుతున్నా కూడా బాల్య వివాహాలు చేయడం బాధాకరమని రాప్తాడు పీ.హెచ్.సి. వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ అన్నారు. వైద్యాధికారి డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు. వెంకటరమణ బుధవారం గంగుల కుంట గ్రామంలో బాల్యవివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం-2006 టీనేజ్ గర్భం వల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మూఢనమ్మకాలతో, ఇతర కారణాలతో ఆడపిల్లలకి చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల రక్తహీనతకు గురి కావడమే కాకుండా, సంక్లిష్ట కాన్పుకు దారితీస్తుందన్నారు. తద్వారా మాతా శిశు మరణాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. స్త్రీల నిష్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించుకున్న వారికి జైలుశిక్ష జరిమానా తప్పదన్నారు.

ఎస్‌టిపిఎం స్టార్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-జెఎన్టియుపి : మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న పి.నందిని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వారి ప్రతిష్టాత్మకమైన ఎస్‌టిపిఎం స్టార్స్ స్కాలర్‌షిప్ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఎస్‌టిపిఎం స్టార్స్ స్కాలర్‌షిప్‌కు పి.నందిని ఒకరుగా ఎంపికైనందుకు గర్వంగా ఉందని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెల్ ఇంచార్జి డాక్టర్ సమీనా తెలియజేశారు. పి.నందిని కష్టపడి సాధించిన అర్హత, అకాడమిక్ ప్రతిభ వ్యక్తిగత లక్ష్యాల ద్వారా 67,500లు స్కాలర్‌షిప్‌కి ఎంపికైంది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అందించే ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు గ్రామీణ, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆశాజ్యోతి వలె నిలుస్తున్నాయని అన్నారు. స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందనలు తెలిపారు.

ఆర్డీటీని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : జిల్లాల్లో ఉన్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాడనికి ప్రతి ఒక్కరి బాధ్యత అని అంబేద్కర్ సేన నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రెవిన్యూ కార్యలయం వద్ద నిరసన తెలిపారు. సేవ్ ఆర్డీటీ అని నినదాలు చేశారు. మహనీయుడు ఫాదర్ ఫెర్రర్ వల్ల దాదాపు మూడు జిల్లాలో విస్తరించి పేదల పాలిట సంక్షేమ ప్రదాయినిగా మారిందన్నారు. ఆరోగ్యం, చదువుకు, పేదలకు గూడు కల్పించేందుకు ఆర్డీటీ అండ ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఎఫ్సీఆర్ఏ రెన్యూవల్ చేసి ఆర్డీటీ సేవలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు దివాకర్, గోనేహాళ్ రమేష్, అంబేద్కర్ సేన జిల్లా య వసేన నాయకులు కేసి పవన్ కుమార్, నాగార్జున తదితరలు పొల్గొన్నారు.

13న కసాపురం హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-గుంతకల్లు : మండలంలోని కసాపురం గ్రామంలో శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళ వారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడునాని కార్యనిర్వహణాధికారి కే వాణి తెలిపారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పామిడి : స్థానిక వాసవి కళ్యాణ మండపంలో 11న ఆదివారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మేఘ కంటి ఆపరేషన్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు,ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి, లక్ష్మి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు గురువారం ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థల సౌజన్యంచే బెంగళూరుకు చెందిన కంటి వైద్య ప్రత్యేక నిపుణులచే కంటి రోగాలకు చికిత్సలు చేస్తారని తెలిపారు. పామిడి మండలంతో పాటు చుట్టుప్రక్కల మండలాల ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, లేనియెడల అనుమతించమని పేర్కొన్నారు. ఆపరేషనుకు ఎంపికైన వారిని అదేరోజు లేదా మరునటి రోజు స్థానిక లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రికి బస్సులో తీసుకొని పోయి ఆపరేషన్ చేయించి తిరిగి పామిడికి చేరుస్తారన్నారు. ఉచిత భోజన సౌకర్యం ఇతర సదుపాయాలు శంకర కంటి ఆసుపత్రి వారే సమకూరుస్తారన్నారు. వారం రోజుల తర్వాత వారికి స్థానిక లక్ష్మీ ఆసుపత్రిలో ఆపరేషన్ కళ్ళను పరీక్షించి ఉచితంగా కంటిఅద్దాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం క్షేమం

విశాలాంధ్ర-యాడికి : మండల పరిధిలోని రాయల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజు ఆధ్వర్యంలో గర్భవతులను గురువారం అన్ని రకాల రక్త పరీక్షలు చేయించి వారికి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకుని సూచనలు సలహాలు తెలియజేశారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కాన్పునకు 108 ద్వారానే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని తెలిపారు. రక్తహీనత ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఎక్కించుకొనవలెనని తెలియజేశారు. గర్భవతులు నెలకు ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలన్నారు. తప్పక రెండు టీటీ ఇంజక్షన్లు వేయించుకోవాలనితెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబ్బీర్ అహమ్మద్ సరోజమ్మ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐ సాయి ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద వీహెచ్పి నాయకులు నిచ్చెన మెట్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో సిఐ సాయి ప్రసాద్ ను సస్పెండ్ చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్ మాజీ జిల్లా అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసులు ధర్మవరం ఇంచార్జ్ హరీష్ యాదవ్ పాల్గొన్నారు. మొదటగా యల్లనూరు రోడ్డు సర్కిల్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో పహాల్గంలో ఉగ్రవాదులు టూరిస్ట్ ప్రజలను మట్టుపెట్టి మన మహిళల బొట్టు చెడిపేశారు. దీనికి ప్రత్యేకగా మంగళవారం రాత్రి ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు మెరుపు దాడులు చేసి కొంతమంది ఉగ్రవాదులను మట్టు పెట్టారు. ఈ సందర్భంలో దేశ ప్రజలంతా ఆనందంతో టపాసులు పేల్చడం, మిఠాయిలు పంచుకున్నారు. అందులో భాగంగానే తాడిపత్రిలో కూడా పోలీస్ స్టేషన్ సర్కిల్లో ఆనందోత్సవ కార్యక్రమం జరుపుతుంటే సిఐ సాయి ప్రసాద్ విహెచ్పి నాయకులను, కార్యకర్తలను, ప్రజలను దుర్భాషలాడి, షర్టు పట్టుకొని లాక్కొని వచ్చి స్టేషన్లో దాదాపు ఎనిమిది గంటల వరకు కూర్చోబెట్టుకుని బయటకి పంపించారు. తాడిపత్రి ఏమన్నా పాకిస్థానా అంటూ సంబరాలు జరుపుకోకూడద అని ప్రశ్నించారు. వెంటనే సీఐను సస్పెండ్ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు హరీష్ రెడ్డి, శేషానంద్ రెడ్డి, సింగరి లక్ష్మీనారాయణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లన్న గారి రామాంజనేయులు పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సి వంతెన పనులు వేగవంతం చేయండి..



విశాలాంధ్ర-బొమ్మనహాల్: తుంగభద్ర ఎగువ కాలువపై జరుగుతున్న పనులను అనంతపురం హెచ్ఎల్‌సి ఈఈ రమణారెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని ఎగువ కాలువ 115/167, 117.794, 117 నుండి 118 వరకు 169/300 కిలోమీటర్ల వద్ద .. నాగలాపురం, మైలాపురం, దర్గాహొన్నూరు గ్రామాల వద్ద పరిధిలో జరుగుతున్న వంతెన నిర్మాణం , లైనింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. రూ.37 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

యువకుడి అదృష్టంపై కేసు నమోదు

విశాలాంధ్ర-యాడికి : కురుకుంట గ్రామానికి చెందిన గురివిరెడ్డి కుమారుడు విజయ భాస్కర్ రెడ్డి ఈనెల 2 నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు యాడికి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా విజయ భాస్కర్ రెడ్డి తన తల్లిదండ్రులతో కలిసి ఏప్రిల్ 28న కొట్టాలపల్లిలో జరిగిన బంధువుల వివాహ కార్యక్రమానికి వెళ్లాడు. మే 2 వరకు కొట్టాలపల్లి లో ఉన్న విజయభాస్కర్‌రెడ్డి తిరిగి ఇంత వరకు తమ గ్రామం కురుకుంట్ల రాలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరన్న పేర్కొన్నారు.

హంద్రీనీవాను వెడల్పు చేసి ఆయకట్టుకు నీరివ్వాలి

10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలి

ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఉరవకొండ: హంద్రీనీవా ప్రధాన కాలవను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ. హంద్రీనీవా వెడల్పు కాల్వపనులను పరిశీలించడానికి శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున స్వాగతిస్తున్నామన్నారు. నాలుగుసార్లు ముఖ్య మంత్రిగా పనిచేసి 50 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాతో పాటు రాయల సీమ జిల్లాల్లో కరువును నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం కరువుకు గురవుతున్న రాయలసీమ జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించాలనే ఉద్దేశ్యముతో 1988లో క్రిష్ణా జలాలను రాయలసీమకు ఇవ్వాలని శ్రీశైలం డ్యాం నుండి హంద్రీనీవా పథకం ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు క్రింద రాయలసీమ జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించాలని అందులో అనంతపురం జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని దివంగత ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు వైయస్ రాజశేఖర్‌రెడ్డి గొప్ప ఆశయాలతో ఈ పథకాన్ని ప్రారంభించారని వారి లక్ష్యాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పదివేల క్యూసెక్కులతో హంద్రీనీవా వెడల్పు పనులు చేపడతామని చంద్రబాబు హామీ ఇచ్చారని. అయితే హామీని అమలు చేయకుండా 800 క్యూసెక్కులుకు మాత్రమే వెడల్పు పనులు చేపట్టిందన్నారు. రెండవ దశకు లైనింగ్ చేయాలని నిర్ణయించి టెండర్లను పిలవడం జరిగిందన్నారు. లైనింగ్ చేస్తే రైతాంగానికి ఉరితాళ్లు బిగించినట్లే అన్నారు. లైనింగ్ పనులకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకం అన్నారు తుంగభద్ర, శ్రీశైలం డ్యాములు నిండి నీరంతా పొంగిపొర్లి సముద్రంపాలవుతుందని వృధా నీటిని అనంతపురం జిల్లాకు తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎల్‌సి కాలువను ఆధునికీ కరించి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పదివేల క్యూసెక్కులకు వెడల్పు చేసి జిల్లాకు 100 టీఎంసీల నీటిని తేవాలన్నారు.

విద్యార్థులతో డబ్బు వసూలు చేయడం తగదు

- ఐటిఐ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద ధర్నా

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : అనంతపురం నగరంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల విద్యార్థులతో డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాల వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మంజునాథ్ ,ఉమా మహేష్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో ఒక్క రోజు అప్సెంట్ అయితే 200 చొప్పున వారం రోజులు అప్సెంట్ అయితే రూ.1000 చొప్పున వసూలు చేస్తున్న ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మాయమాటలు చెప్పి మీకు హాజరు శాతం 100 శాతం కి 100 శాతం వచ్చేలా చేస్తాం ఒక్కరోజు అప్సెంట్ అయితే 200 కట్టండి వారం రోజులు అప్సెంట్ ఐతే వేయి రూపాయలు ఇవ్వండి అనే విధంగా ప్రభుత్వ ఐటిఐ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తుందనీ అన్నారు. ఐటిఐ కళాశాలలో ఫ్యాన్లు లేకపోయినా లైట్లు పనిచేయకపోయినా వాటికి విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేయడం దారుణమని మండిపడ్డారు. విద్యార్థులకు విద్య చెప్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థుల నుండి డబ్బులు వసూల్ చేస్తూ విద్యార్థులకు తరగతులు చెప్పకుండా మాకు ఇష్టం వచ్చినప్పుడే తరగతులు చెప్తాం మీకు ఇష్టముంటే రండి లేకుంటే లేదు అనే విధంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులతో మత్తు పానీయాలు తెప్పించుకొని కళాశాలలోనే త్రాగుతూ విద్యార్థులకు తరగతులు చెప్పకుండా విద్యార్థులకు మాయ మాటలు చెపూతూ ఒక వారానికి కాను ఒకటి లేదా రెండు తరగతులు మాత్రమే చెబుతూ తరగతులు విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే ప్రిన్సిపాల్ ఎవరైతే డబ్బులు వసూలు చేశారో ఆ ఉపాధ్యాయులపైన చర్యలు తీసుకొని ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తాం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి నాని నగర సహాయ కార్యదర్శి సమీర్, సాయి, ప్రవీణ్, బాబు, జాన్, ప్రశాంత్, సుపియన్, కళాశాల విద్యార్థులు జగన్, కిరణ్, ప్రేమ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూరంతో ఉగ్రవాదుల భరతం పట్టిన భారత్

ఆపరేషన్ సింధూరం స్వాగతించిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర-కణేకల్లు: పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత్ వైమానిక మిసైల్ ద్వారా జరిపిన దాడులను కనేకల్ మండల బిజెపి అధ్యక్షులు తిప్పేస్వామి,మాజీ మండల అధ్యక్షులు, మల్లయ్య చౌదరి , విశ్వహిందూ పరిషత్ రవి, జీవన్ ఇతర నాయకులు స్వాగతించారు. గురువారం బిజెపి మండల కన్వీనర్ తిప్పేస్వామి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూరతో ఇండియన్ ఆర్మీ ఉగ్రవాదులను మట్టు పెట్టిందని, హహోల్గాం ఉగ్రదాడికి భారతమాత నుదుటిపైన జరిగిన దాడిగా భావించి ఆ రక్తాన్ని సింధూరంతో పోల్చుతూ ప్రధానమంత్రి ఈ ఆపరేషనుకు సింధూర అనే పేరు పెట్టడం జరిగింది.

భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూరంను దేశ ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు. సింధూరం అంటే భారత సంప్రదాయంతో ఒక స్త్రీ మహిళ తన భర్త బ్రతికి ఉన్న ప్రతికగా ఆమె నుదుటిన సింధూరం ఆమె గౌరవానికి భద్రతకు సంప్రదాయానికి హిందుత్వంలో భార్యగా ఉన్న స్థానానికి చిహ్నంగా భావిస్తారు మన హిందువులు. ఉగ్రవాది దాడులు జరగకుండా మన దేశ ఆర్మీ వారు పాకిస్తాన్ కి సరైన గుణపాఠం నేర్పారు .ఆర్మీ సోదరులందరికీ మా వందనాలు సెల్యూట్, అలాగే పాకిస్తాన్ ఉగ్ర భూతాన్ని తరిమికొట్టాలి భారత ఆడపడుచులకు తండ్రిలాగా పెద్ద లాగా ఉన్న మన దేశ ప్రధానమంత్రి మోడీ మన ఇండియన్ ఆర్మీకి మనమందరము వారికి అండగా నిలిచి మద్దతు తెలిపాలని మనమంతా వారికి సహకరించాలని బీజేపీ నాయకులు తెలిపారు.

కళాజాత ద్వారా ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-అనంతపురం : కళా జాత ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారిని డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి వారి ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కలిగించేందుకు కళాజాతర కార్యక్రమాన్ని గురువారం జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారిని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో 20 రోజులు పాటు కళాబృందాలు రోజుకొక చోట వీధి నాటక కళారూపం ద్వారా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవి ప్రభావం ఉన్న 20 మండలాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సూపర్వైజర్ జివి రమణ, పిఎంఓ నాగన్న, మురళి, నారాయణ స్వామి, చైల్డ్ ఫండ్ ఇండియా రమేష్ యాదవ్ వారి సిబ్బంది, రిడ్స్ నరేష్, వారి సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మా బాధలు తీర్చండి .. సీఎం సారూ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : గత కొన్ని నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని శ్రీరామ రెడ్డి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం నుంచి పట్టణంలో వినూత్న రీతిలో, ర్యాలీ నిర్వహించి టీ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మా ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టవాని ప్రశ్నించారు. పెండింగ్లో ఉన్న 30 నెలల పిఎఫ్ 7 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని, 33 రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులకు మా గోడు పట్టదా అని వారు ప్రశ్నించారు. మా నుంచి జిల్లాలో వందలాది గ్రామాలు గొంతు తడుపుకుంటున్నాయని, దానిని కూడా ప్రభుత్వం గుర్తించదా అన్నారు. సీఎం సభకు తరలివచ్చి మా గోడును విన్నవించుకుంటామని, అప్పటికైనా మా సమస్య పరిష్కరిస్తారో లేదో చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, రంగనాథ్, వన్నూరు స్వామి, నరేష్, గంగాధర్, భాష, నాగరాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-గార్లదిన్నె: మండలంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్44 పక్కన కనుంపల్లి గుట్టలో ఒక గుర్తు తెలియని మగ శవం పడి ఉన్నది. మృతుడు 55 నుండి 60 సంవత్సరాల మధ్య కలదు, రంగు చామన ఛాయ, ఎత్తు 5 అడుగులు, దుస్తులు రోజ తెలుపు గల్ల టవల్, ఫుల్ బనియన్, మెరూన్ రంగు ఫుల్ అండర్ వేర్, తెలుపు రంగు లుంగీ, తెలుపు రంగు అంగీ వేసుకుని ఉన్నాడు. చెప్పులు, వాటర్ బాటిల్, కూల్ డ్రింక్ బాటిల్, విషపు బాటిల్ కలవు. ఎస్ఐ గార్లదిన్నె 9440796813, సిఐ శింగనమల 9346010558 ఫోన్ నంబర్లకు తెలపాలని చెప్పారు.

రైతులకు మట్టి పరీక్షలపై అవగాహన

శాలాంధ్ర-కూడేరు : కూడేరు రైతు సేవా కేంద్రంలో మండల ప్రాథమిక వ్యవసాయ సంఘం సభ్యులకు, రైతులకు మట్టి పరీక్షల కేంద్రం, టెక్నికల్ వ్యవసాయ అధికారి శ్రీనాథరెడ్డి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేకుండా విచక్షణా రహితంగా రసాయనిక ఎరువుల వాడకం, పరిశ్రమల, వాహనాల ద్వారా విడుదలయ్యే వాయు కాలుష్య కారకాలైన కార్బన్ డై ఆక్సైడ్,మీథెన్, నైట్రస్ ఆక్సైడ్ లాంటి హరిత వాయువుల వల్ల భూమి వాతావరణం త్వరగా వేడెక్కడం వలన రుతుపవనాల అడ్డగింపు, కరువులు, వరదలు, అంటువ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ప్రతి రైతు ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించి పరీక్ష ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పచ్చిరొట్ట ఎరువులను, సూక్ష్మ పోషక పదార్థాలను నేలను దుక్కి చేసేటప్పుడు వాడటం వల్ల పెట్టుబడులు ఆదా అవడమే కాక సుస్థిర ఆదాయంతో పాటు నేల ఆరోగ్యం పర్యావరణం కూడా కాపాడబడుతాయని రైతులకు తెలిపారు. మట్టి పరీక్షలను రైతులు ఏవిధంగా, ఎక్కడ సేకరించాలో వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది ఇందుమతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 9, మే 2025

కోర్టు స్టేటస్‌కో ఉన్నా పేదల ఇళ్లు కూల్చడం దారుణం

న్యాయం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతి

విశాలాంధ్ర-పెనుకొండ : సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయని పల్లి వద్ద సర్వే నెంబరు 700లో గత 3 సంవత్సరాలుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని రేకులు షెడ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్న ఇల్లు లేని నిరుపేదలు కోర్టు స్టేటస్కు ఆర్డర్ లెక్కచేయకుండా బుధవారం పంచాయతీ అధికారులు పేదలు కట్టుకున్న ఇండ్లను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా కోర్టులో ఉందని చెప్పిన వినకుండా దౌర్జన్యంగా కట్టిన ఇండ్లను కూల్చి వేసి పంచాయతీ సిబ్బందితో ట్రాక్టర్లో వేసుకొని వెళ్లడం దారుణం అని ఆరోపించారు.పేదలు చాలా కాలంగా ఇల్లు లేక అప్పు, సప్పో చేసుకుని గుడిసెలు వేసుకుని సిమెంటు ఇటుకలతో రేకులు షెడ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తుండగా పంచాయతీ అధికారులు అక్కడికి వచ్చి గత మూడు సంవత్సరాల కిందట వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇల్లులేని నిరుపేదలు దాదాపుగా 150 మంది గుడిసెలు వేసుకోవడం జరిగింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్కడ పేదలు నిర్మించుకున్న షెడ్లకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నిర్దాక్షణంగా కూల్చివేయడం జరిగింది. ఈ స్థలం కోర్టు స్టేటస్కో ఆర్డర్ సంబంధిత ఎమ్మార్వోకి ఆర్డిఓ ఆనందరావుకి పంచాయతీ అధికారులకి పోలీస్ స్టేషన్లో జిల్లా కలెక్టర్ వారికి ఇవ్వడం జరిగింది .ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని తొలగించిన చోట ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్, సిపిఐ నాయకులు రాజగోపాల్, చాంద్ భాషా, శీలా నారాయణస్వామి, ఆంజనేయులు, మహిళా సంఘం నాయకురాలు అంజనమ్మ , నూర్జహాన్ పాల్గొన్నారు.

20వ తేదీ దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వేమయ్య పిలుపు

విశాలాంధ్ర-పుట్టపర్తి: మే 20వ తేదీ జరిగే జయప్రదం చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి యాదవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జిల్లా ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకు ముఖ్యఅతిథిగా ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు వేమయ్య యాదవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా వేమయ్య మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సంఘటీత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ మే20వ తేదీ లోపు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ సమ్మె సందర్భంగా బైక్ ర్యాలీలు,సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు, నియోజకవర్గాల వారిగా మరియు మండల సన్నాహక సమావేశాలు నిర్వహించి దేశవ్యాప్త సమ్మె పెద్ద ఎత్తున జయప్రదం కోసం అన్ని ప్రజాసంఘాలు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చౌలురు రవికుమార్, మారుతి రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిలు పెనుగొండ రమేష్, జబివుల్లా, జిల్లా నాయకులు రాజగోపాల్, ముత్యాలప్ప, నారాయణస్వామి, సురేష్, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

భారతి కంటి ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట

విశాలాంధ్ర-కదిరి: కదిరి పట్టణంలో సైదాపురంలో రాయల్ ఎంఫిల్డ్ షో రూమ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన భారతి కంటి ఆసుపత్రిని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లల నుండి వృద్ధుల వరకు అనేక మంది కంటి జబ్బులతో బాధ పడుతున్నారని, చికిత్స కోసం సూదుర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలో ఏర్పాటు చేసిన వైద్యులను అభినందించారు.

కంటి చికిత్స కోసం వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజ్యమానులకు తెలిపారు. అనంతరం కదిరి నుండి విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన నూతన బస్‌ను ప్రారంభించారు. ఈ ప్రాంతం నుండి ఉన్నత విద్య కోసం అనేక మంది విద్యార్థిని, విద్యార్థులు విజయవాడకు వెళ్తున్నారని వారి ఉన్నతి కోసం ఇలాంటి సౌకర్యాన్ని ఏర్పాటు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం..

24 మంది రక్తదానం రెడ్‌క్రాస్ సంస్థ సేవలు మరువలేనివని వక్తలు కితాబు

విశాలాంధ్ర-గోరంట్ల : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ గోరంట్ల మండలంలోని కమ్మల వాండ్ల పల్లి వద్ద జీన్ హేడ్రీ డునాంట్‌కు పూలమాలతో స్మరించుకొన్నారు, అదేవిధంగా రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు, 34 మంది రక్త దాతలు రక్త దానం చేశారు, కోడికొండ చెక్ పోస్ట్‌లో సమర్థన్ ట్రస్ట్ శిక్షణ పొందుతున్న వికలాంగులకు 30 కిట్లను అందజేశారు, ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి జిబి. విశ్వనాథ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దేవాంగం జగదీశ్వర్, పవిత్ర, కుమార్ రెడ్డి, బెస్ట్ యూనివర్సిటీ వైఛాన్సిలర్ అనురాధ ఘర్, రిజిస్టర్ జయ ప్రకాష్, డీన్ ఏబీఎన్ శర్మ, ఏవో శ్రావణీ, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ బి.రమేష్, హిందూపురం గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ సెంటర్ సిబ్బంది, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

అగళికి చేరిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు

విశాలాంధ్ర-అగళి : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర లో బాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి సంబందించిన పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు గురువారం అగళి కి చేరాయి. 6 నుండి 10 తరగతి వరకు 19310 నోట్ పుస్తకాలు అదేవిదంగా 10830 పాఠ్యపుస్తకాలు చేరాయని ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఇంకా 4000 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉన్నాయని అవికూడా త్వరలోనే వస్తాయన్నారు.మే 20 నాటికి స్టూడెంట్ కిట్ లు 3 జతల యూనిఫాం,బూట్లు డిక్షనరీ,బ్యాగ్,సాక్స్ అన్ని పూర్తిస్థాయిలో చేరుతాయని తెలిపారు.

ప్రతి పౌరుడూ దేశ భద్రతలో భాగస్వామి కావాలి ..

- హరీష్ బాబు నేతృత్వంలో ధర్మవరం వీధుల్లో దేశభక్తి పరవళ్లు
- భారత సైన్యం వీరతకు సెల్యూట్‌గా ధర్మవరంలో ర్యాలీ

విశాలాంధ్ర ధర్మవరం : పట్టణంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా దేశ భద్రత కోసం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్‌ను ప్రజలకు వివరించి, దేశభక్తి భావాలను ప్రోత్సహించారు. ర్యాలీ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, భారత సైన్యం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటింది అని తెలిపారు. ఈ విజయాన్ని ప్రజలతో పంచుకోవడం మా బాధ్యత, అని అన్నారు. అలాగే, దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు. జాతీయ జెండాలు పట్టుకుని జై హింద్, భారత్ మాతా కీ జై వంటి నినాదాలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ ప్రజల్లో దేశభక్తి భావాలను రేకెత్తించింది. హరీష్ బాబు మాట్లాడుతూ, భారత సైన్యం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిందని,

ఈ విజయాన్ని ప్రజలతో పంచుకోవడం మా బాధ్యత అన్నారు. అలాగే, దేశ భద్రత కోసం ప్రతి పౌరుడు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని వారు తెలిపారు.

అమర వీర జవాన్లకు నివాళులు

విశాలాంధ్ర, ధర్మవరం : ఈనెల 7వ తేదీన మన భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను ఆపరేషన్ సింధూర ద్వారా ధ్వంసం చేసి సైనిక సత్తా నిరూపించడం జరిగిందని ఆదర్శ సేవా సంఘం సంఘ అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి గౌరవాధ్యక్షులు చెన్నాసూరి ప్రకాష్ కార్యదర్శి నాగార్జున తెలిపారు. ఆపరేషన్ సింధూరకు గురువారం వారు సంఘీభావాన్ని ప్రకటించారు. అంతకుమునుపు అమరవీరులకు వారు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత సైనికులు పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేయడం మొట్టమొదటి విజయమని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి, కుమార్, నాగభూషణం, ప్రభాకర్ గుప్తా, నాగరాజు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర ధర్మవరం : పట్టణంలోని ఎన్జీవో హోంలో హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు జడ్జిల ఆదేశాల మేరకు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సును లాయర్ బాలసుందరి, ఎమ్మెల్యే లక్ష్మీదేవి, పోలీసులు నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని, అట్లు పాటించని యెడల కఠిన చర్యలు చట్టపరంగా తీసుకుంటామని చెప్పారు. కార్మికుల హక్కులు, ఇన్సూరెన్సు, ఈశ్రమ్ కార్డ్స్, లేబర్ ఆక్ట్, ఉచిత న్యాయ సహాయం, మండల న్యాయ సేవా కమిటీ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ న్యాయ సహాయమును అందిస్తారని తెలిపారు. కానిస్టేబుల్ శివానంద మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండవని తెలిపారు. కావున డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు.

ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలాలకు టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర, ధర్మవరం : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలములకు టెండర్లను ఆసక్తిగల వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోవచ్చని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీ స్థలములలో బేకరీ స్వీట్స్ అండ్ కూల్ డ్రింక్స్ అండ్ ఫ్రూట్ జ్యూస్ అండ్ లస్సి షాపులకు, గోడౌను, ఇంటర్నెట్ జిరాక్స్, మొబైల్స్, మిల్లెట్స్ అండ్ కూల్ డ్రింక్స్ లాంటి వ్యాపారాలను నడుపుకోవచ్చునని వారు తెలిపారు. టెండర్ దరఖాస్తుకు ఆయా షాపులను బట్టి రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.32 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 16వ తేదీ వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల లోపల 885 రూపాయలు చెల్లించి టెండర్ ఫారంను పొందవచ్చునని తెలిపారు. ఈనెల 17వ తేదీన పుట్టపర్తి లోని జిల్లా రవాణా అధికారి వారి కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు నుండి మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ బాక్సులో వేయాలని తెలిపారు. ఇదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరవబడునని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ..

విశాలాంధ్ర-రొద్దం: మండల పరిధిలోని బూచెర్ల గ్రామం లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు మంత్రి సవితమ్మ చొరవతో గ్రామానికి 60 వేల లీటర్ల కెపాసిటీతో దాదాపు 30 లక్షల బడ్జెట్‌తో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంజూరైంది. ఈ నేపథ్యంలో గురువారం రొద్దం టీడీపీ మండల లీడర్లు, బూచెర్ల టీడీపీ లీడర్లు, కార్యకర్తలు కాంట్రాక్టర్ తో కలసి భూమి పూజ చేశారు. దీంతో బూచెర్ల గ్రామ ప్రజలు మంత్రి సవితమ్మకి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆలయ ప్రహరీ గోడ ధ్వంసం

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని దుద్దే బండ క్రాస్ వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని శ్రీ షిరిడి సాయిబాబా, వినాయక ఆలయ ప్రహరీ గోడ ధ్వంసమైందని ఆలయ ధర్మకర్త గుర్రప్ప స్వామి తెలిపారు, ఆలయం చుట్టూ రోడ్డు ఉండటం వల్ల కియా పరిశ్రమ వాహనాలు రాత్రనక పగలనక తిరుగుతూ ఉండటం ఏ వాహనం వచ్చి గోడకు తగిలించారో, తెలియదని తెలిపారు. ఆలయం ప్రహరీ ధ్వంసం కావడం చాలా బాధాకరమని ఆయన తెలిపారు.

పోతులకుంటలో పర్యటించిన కేఏ పాల్

విశాలాంధ్ర-కొత్తచెరువు : ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్, గురువారం మండలంలోని పోతులకుంట గ్రామంలో పర్యటించారు. అనంతపురంలో నిర్వహించిన సేవ్ ఆర్డిటి కార్యక్రమంలో పాల్గొని అనంతరం గ్రామంలో పర్యటించారు. శ్రీనివాసరెడ్డి ఇంటికొచ్చి ఆయన్ను పరామర్శించారు. అనంతరం గ్రామంలో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు : నూతన రేషన్ కార్డు కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార& నీలకంఠ రెడ్డి తెలిపారు. మే 31వ తేదీ లోపల నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయాలలో అందజేయాలన్నారు. చేర్పులు మార్పులకు తొలగింపునకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ నుండి స్మార్ట్ కార్డ్ సైజులో ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జూన్‌లో అందిస్తామన్నారు

వివాహ వేడుకలకు హాజరైన మాజీ మంత్రి పల్లె

విశాలాంధ్ర-అమడగూరు : జెకేపల్లి గ్రామంలో యనమల వారి పెళ్లి పిలుపు మహోత్సవానికి గురువారం మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులు సుబ్రహ్మణ్యం, హారికను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన పశువుల దాహార్తిని తీర్చే నీటి తొట్లను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, కృష్ణమూర్తి రాజారెడ్డి, బాలు, కృష్టారెడ్డి, కుమార్‌రెడ్డి, మధు ఖాన్, టీడీపీ పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభం

విశేష హోమాలు, అర్చనల నిర్వహణ

విశాలాంధ్ర-అమరాపురం : మండల పరిధిలోని నడలుడం గ్రామంలో ఆంజనేయస్వామి నూతన దేవాలయం విగ్రహ పున ప్రతిష్టాపన, శిఖర కలశ స్థాపన కార్యక్రమం గురువారం ప్రారంభమైనది. ఈ సందర్భంగా గంగపూజ, గణపతి పూజ నవగ్రహారాధన రక్షాబంధన హెూమాది కార్యక్రమాలతో వేద పండితులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం నందు నడలుడం వలస విరపసముద్రం గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణపు దాత ఆర్. చిత్ర శేఖర్ శివరుద్రప్ప, సర్పంచ్ నాగవేణి జితేంద్ర నాగేంద్రప్ప, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శుక్రవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన, కలశ స్థాపన హెూమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా శ్రీరామ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

హాజరైన ఎలేరాంపుర హనుమంతనాథ స్వామీజీ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీరామ దేవాలయ నిర్మాణానికి గురువారం ఏలేరాం పురం పీఠాధిపతి హనుమంతనాథ స్వామీజీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి భూమి పూజ చేసారు. ముఖ్య అతిథులుగా ఎలైరాంపురం హనుమంతనాథ స్వామీజీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డిలు హాజరయ్యారు. అర్చకులు వేదమంత్రాలతో భూమి పూజ చేయించారు. శ్రీరామ నామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. నిర్దేశించిన సమయానికెళ్ల దేవాలయం నిర్మాణం పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచించారు. ఈ సందర్భంగా ఏలేరాంపుర హనుమంతనాథ స్వామీజీని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డిని స్థానిక గ్రామ ప్రజలు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, జిల్లా లీగల్ సెల్ రాధాకృష్ణ, జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శిల్పాకేంచుయాదవ్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ ఆచార్, మాజీ సర్పంచ్ రవికుమార్, కౌన్సిలర్ ఉమా శంకర్, క్లస్టర్ ఇంచార్జ్ లక్ష్మీనరసప్ప, మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఇర్గేపల్లి శ్రీనివాస్, ఆర్‌జి పల్లి సర్పంచ్ సన్నమ్మ రంగప్ప, పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రొద్దం: టీవీ వ్యాధిపై రొద్దం ప్రాథమిక వైద్య అధికారి సోమశేఖర్ రెడ్డి గురువారం లోచర్ల ఆరోగ్య కేంద్రంలో టీబీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మద్యపానం ధూమపానం షుగర్ రోగులకు టీడీ కార్మికులకు ఇటుక బట్టీల కార్మికులకు రెండు వారాల నుంచి దగ్గు ఉండి గల్లపడే వారికి గల్లను సేకరించి రుద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరీక్ష నిమిత్తం పంపామని చెప్పారు. చెడు అలవాట్లకు దూరం గా ఉండాలన్నారు. సర్పంచ్ గంగాధర, పీహెచ్ఓ విజయలక్ష్మి, పెనుగొండ ల్యాబ్ టీబి సూపర్వైజర్ బీబీ రాణి, ఏఎన్ఎంలు ఈశ్వరమ్మ, వేదవతి పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా వెంకట లక్ష్మమ్మ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నూతన ఎంపీడీవో గా గురువారం వెంకట లక్ష్మమ్మ బాధ్యతలు స్వీకరించారు. గతంలో సోమందేపల్లి యుఆర్‌డిగా పనిచేస్తూ బదిలీ నిమిత్తం సింగనమలకు వెళ్లిన ఈమె ప్రస్తుతం పదోన్నతిపై సోమందేపల్లి మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో పనిచేయు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితర సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఆమెను కలిసి శాలవా పూలమాలతో సన్మానించి ఆహ్వానం పలికారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేస్ నమోదు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. రొద్దం మండలం లోచర్ల గ్రామానికి చెందిన ముత్యాలప్ప సన్నాఫ్ నర్సప్ప అతనికి పెనుకొండలోని రామ మందిరం వీధి ఇసుక వంకల్లో నివాసం ఉన్న పద్మనాభ రావు కుమారుడు కృష్ణారావు డబ్బులు తీసుకొని భూమి అగ్రిమెంట్ చేయించి భూమి ఇతరులకు అమ్మినందున భూ బాధితుడు ముత్యాలప్ప వారి ఇంటి దగ్గరికి వెళ్లి న్యాయం అడిగాడు. దీంతో ముత్యాలప్పను కృష్ణారావు, అతని భార్య లీలమ్మ కులం పేరుతో దూషించి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. ఈ మేరకు ముత్యాలప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణారావు, అతని భార్య లీలమ్మపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎంపీడీవోగా ఆర్.పార్థసారథి

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల అభివృద్ధి అధికారిగా ఆర్.పార్థసారథి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పిస్తామని, సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డి మాధవరెడ్డి, ఏపీవో మంజుల పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టాలి.. ఆర్డీవో మహేష్

విశాలాంధ్ర ధర్మవరం : ధర్మవరం డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను సంబంధిత అధికారులు తప్పక అరికట్టాలని ఆర్డిఓ మహేష్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డిఓ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు, గనుల అధికారులకు గురువారం సమావేశాన్ని ఆర్డిఓ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమంగా ఇసుక రవాణా తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. మండల స్థాయి సిబ్బందికి అక్రమ రవాణా నివారణ చర్యల అమలులో తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. అక్రమ రవాణా జరిగినట్లు రుజువైతే రవాణా చేయు వ్యక్తులు వాహనములను సీజ్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇసుక రవాణా పర్యవేక్షక ఇన్చార్జులు, పోలీస్ అధికారులు, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన చెన్నకేశవుడు..

విశాలాంధ్ర, ధర్మవరం.. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు 5వ రోజు దాతలు, భక్తాదులు, ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం పల్లకి ఉత్సవంలో స్వామివారు పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. తొలుత అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు,చక్రధర్‌లు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలయం ప్రత్యేక అర్చనలు, పూజలు చక్కటి అలంకరణ చేశారు. వాహనానికి ఉభయ దాతలుగా వ్యవహరించిన వారి పేరిటన ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి వారిని చైర్మన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. తదుపరి పట్టణ పురవీధుల గుండా ప్రత్యేకమైన వాహనంలో స్వామివారు ప్రజల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలతో పాటు పట్టణ పుర ప్రముఖులు, ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రదానం చేసిన వృద్ధుడు..

విశాలాంధ్ర ధర్మవరం : పట్టణంలోని రామ్ నగర్‌కు చెందిన కోదండ రామాలయ సభ్యులు అన్నం వెంకటనారాయణ మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు విశ్వదీప సేవా సంఘం వారు నేత్రదానంపై అవగాహన కల్పించి కుటుంబ సభ్యుల సహకారంతో విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కుళ్లాయప్ప, కంటి రిట్రోల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్, విజయ్ భాస్కర్ రెడ్డి, కంటి వైద్యులు డాక్టర్ నరసింహులు నేత్రాలను సేకరించారు. నేత్రానికి సహకరించిన కుటుంబ సభ్యులకు విశ్వదీప సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు పి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు శేఖర్‌రెడ్డి తోపాటు సుబ్రహ్మణ్యం, జుజారు రఘు, కేశవరెడ్డి, ధనుంజయ, మాధవ, ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కథలు, గ్రామర్‌పై అవగాహన

విశాలాంధ్ర ధర్మవరం : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో గురువారం 9వ రోజు తెలుగు కథలు, ఇంగ్లీష్ గ్రామర్ మెలకువలపై శిక్షణ ఇచ్చామని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యం సాధిస్తే ప్రపంచంలో ఎక్కడైనా బతకవచ్చన్నారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. గ్రంథాలయాలలో చదువు, పోటీ పరీక్షల పుస్తకాలు కూడా ఉచితంగా లభిసాయని చెప్పారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 09, మే 2025

సమయ పాలన పాటించని
సదరం క్యాంప్ వైద్యుడు

డాక్టర్ కోసం దివ్యాంగుల ఎదురుచూపులు
పర్యవేక్షణ కరువు

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంపు వారానికి రెండు రోజులు నిర్వహిస్తారు, దివ్యాంగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కోసం నార్పల మండలం నుంచి దాదాపువంద నుండి 120 మంది దాకా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్నట్లు దివ్యాంగుల ఆవేదన చెందుతున్నారు. డాక్టర్ దివ్యాంగులపై సమయ పాలన పాటించకుండా తనకు ఇష్టం వచ్చిన సమయంలో వచ్చి ఒక గంట మాత్రమే ఉండి చూసి చూడనట్లు సదరం క్యాంపు వెరిఫికేషన్ చేసి వెళ్ళిపోతున్నాడని, దివ్యాంగుల మాత్రం నిరాశ చెందుతూ మాకు పింఛన్ వస్తుందో రాదోననే భయంతో నిరాశ చెందుతూ బాధపడుతూ, నిరాశా నిస్పృహలతో ఇంటికి వెళ్లిపోతున్నామని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ మాత్రం తనకి ఇష్టం వచ్చినప్పుడు చుట్టపు చూపుగా హాస్పిటల్ కి వచ్చి ఒక గంట మాత్రమేఉండి వికలాంగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తూ వెళ్లిపోతున్నాడని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగులపై ఇంత నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్ పైఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని డాక్టర్ సమయం పాలన పాటించే

విధంగా చూడాలని వికలాంగులు కోరుతున్నారు. ఇతర మండలాల నుండి వచ్చి అన్నం నీళ్లు లేకుండా డాక్టర్ కోసం హాస్పిటల్ వద్ద గంటల తరబడి ఎదురుచూస్తూ వికలాంగులపై డాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు, నార్పల మండలం నార్పల గ్రామానికి చెందిన గవ్వల సూర్యనారాయణ అనే వికలాంగుడు ఆవేదనతోడాక్టర్ కోసం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పడిగాపులు కాస్తున్నానన్నారు, హాస్పిటల్ లో డాక్టర్ ఎన్ని గంటలకు వస్తారని అడిగితే మధ్యాహ్నం 12 గంటల పైన వస్తారని కొంతమంది వ్యక్తులు చెబుతున్నారని, కూడు నీళ్ళు లేకుండా ఇబ్బందులె దుర్కొంటున్నామని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల నుండి పలు ప్రమాదాలు

పట్టించుకోని పంచాయతీ అధికారుల

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ గ్రామంలో రోజు రోజుకు పెరుగుతున్న పశువులు. బస్టాండులోను ట్రాఫిక్ మధ్యలోను పశువులు నుండి తరచూ జరుగుతున్న ప్రమాదాలు. ఈ పశువుల గురించి ఎన్నిసార్లు విన్నవించుకున్న నిమ్మకు నీరు ఎత్తినట్లు ప్రవర్తిస్తున్న పంచాయతీ అధికారులు. ఈపశువుల వల్ల ప్రజలకు చిన్న పిల్లలకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి . ఈ పశువుల పోట్లాడినప్పుడు వాహనదారులపైన పడి వాటి నుండి ప్రమాదానికి ఎన్నోసార్లు గురైనారు. వాహనాల్లో వెళ్తున్నప్పుడు అడ్డంగా పరిగెత్తుకుంటూ వాహనాలకు మీద పడుతున్నాయి. ఇకనైనా అధికారులు ఈ పశువులను గోశాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు .లేని పక్షంలో ఈ పశువుల నుండి ఇంకా పలు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు తక్షణమే వీటిపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కాలనీవాసుల దాహార్తిని తీర్చిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో గురువారం ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న కొత్త కొట్టాలు కాలనీలో నాలుగు రోజుల నుండి త్రాగునీళ్లు సరిగా రాకపోవడంతో కాలనీవాసులు అడిగిన వెంటనే మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య ఉచిత మంచి నీరు ట్యాంకరు కాలనీకి తాగునీరు అందించి కాలనీవాసుల దాహార్తిని తీర్చారు. అందుకు కొత్త కొట్టాలలోని కాలనీ వాసులు అడిగిన వెంటనే ఉచిత మంచినీరు ట్యాంకర్ పంపించినందుకు మాజీ ఏపీపీ వేలూరు రంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

లీలావతి వృద్ధ ఆశ్రమానికి రూ.10 వేలు వితరణ

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలోని నగరూరు రోడ్డు లో ఉన్న లీలావతి వృద్ధాశ్రమానికి గురు వారం ఓ మహిళా సేవకురాలు రూ 10,000 చెక్కు ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణికి అందజేశారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఓ వృద్ధురాలి కూతురు ఈ చిరు సాయం ఆశ్రమానికి అందజేసి వృద్ధులకు తమ వంతు ఉడతా భక్తి సేవగా అందజేసినట్లు తెలిపారు. కాగా పేరు కూడా తెలియజేయని ఆ సేవకురాలి ఔదార్యాన్ని పలువురు మెచ్చుకుంటున్నారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరీక్షల కొరకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు,ఇతరత్రా అనారోగ్య కారణాలవల్ల చికిత్సల కొరకు వచ్చిన వారికి, చికిత్సల కొరకు హాస్పిటల్ నందు అడ్మిషన్ అయిన వారికి ఆరోగ్య కార్యకర్తలకు నారాయణ సేవలో భాగంగా సుమారు 150 మందికి అన్నదానం, వాటర్ ప్యాకెట్లు,అందజేసి నారు, ఈ కార్యక్రమానికి ఆగ్నేశమ్మ జన్మదిన సందర్భంగా, వీరి కుమారుడు త్రిపుర రిసార్ట్స్ అధినేత డాక్టర్ కె గోపీనాథ్ సహకరించి సేవలో పాల్గొని సేవలు అందించినారు. ఆగ్నేష్మమ్మకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయుచు, మాకు ఈ సేవా భాగ్యాన్ని కలిగించినటువంటి డాక్టర్ శ గోపీనాథ్ కి, వీరి కుటుంబ సభ్యులకు భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులతో కలగాలని కోరుకుంటున్నామని సత్యసాయి సేవా సమితి తాలూకా అధ్యక్షులు శంకర్ తెలిపారు.

నేడు షాపింగ్ గదులకు వేలం పాటలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువులోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో షాపింగ్ గదులకు శుక్రవారం వేలంపాటలు గ్రామ సర్పంచ్ రాధా అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 9 షాపింగ్ గదులకు వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిపాజిట్ ఆస్తి సర్టిఫికెట్ చెల్లించిన వారు మాత్రమే ఈ వేలం పాటలో పాల్గొనాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

తెలుగు కథలు, ఇంగ్లీష్ గ్రామర్ మెలకువలపై అవగాహన

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో 9వ రోజు తెలుగు కథలు, ఇంగ్లీష్ గ్రామర్పై మెలకువలను, శిక్షణగా ఇవ్వడం జరిగిందని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ చదువుతోపాటు తెలుగు ఇంగ్లీష్ విషయాలపై మెలుకువలను తెలుసుకున్నప్పుడు ఎంతో ఉపయోగపడుతుందని, సులభతరం అవుతుందని తెలిపారు. ధ్యాన యోగం కూడా శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రంథాలయాలలో చదువు, పోటీ పరీక్షలు, వివిధ విభాగాలకు చెందిన అంశాలకు గల పుస్తకాలు కూడా ఉచితంగా లభిస్తాయి అంతేకాకుండా మా గ్రంథాలయంలో ఉచిత సభ్యత్వములు కూడా నిర్వహిస్తున్నామని కేవలం ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చినచో, రుసుమును దాతల ద్వారా సేకరించడం జరుగుతుందని ఇటువంటి అవకాశాన్ని కూడా పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ నాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు కరియోముల గ్రామస్తుల తలారి పరశురాముడుకు ఆహ్వానం

విశాలాంధ్ర-గుంతకల్లు: లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు

ప్రత్యేక పూజలు నిర్వహించి దేవరకొండ మండలం కరియోమల గ్రామస్తులు సర్పంచ్ శ్రీనివాసులు గ్రామ పెద్దలు రావటం శ్రీలక్ష్మీనారాయణ స్వామి దర్శించి అనంతరం ఈనెల మా కరివేముల గ్రామం నందు శ్రీ చెన్నకేశవ స్వామి తిరునాళ్లు 16.5.25 శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం గ్రామోత్సవము జరుగుతున్నది.కావున శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ మూర్తులు కూడా మా దేవస్థానానికి రావాలని శ్రీ చెన్నకేశవ స్వామి తో పాటుగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణం కూడా జరిపించాలని ఆలయ కమిటీ గ్రామ పెద్దలు ఇక్కడకు రావడం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ధర్మకర్తలు తలారి శకుంతలమ్మ పరశురాముడు కలవడం జరిగినది. తలారి పరుశురాముడు మాట్లాడుతూ కరియోమల గ్రామం నుండి వచ్చిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణంతో పాటు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణం కూడా నిర్వహించాలనే మీ మంచి సంకల్పానికి తప్పకుండా శ్రీ లక్ష్మీనారాయణ స్వాములు వారు మీ గ్రామా శాంతి ప్రజల సుఖశాంతుల కోసం వస్తారని తెలిపారు.

బహుజన సంకల్పన సభకు కదం తొక్కిన కార్యకర్తలు

వచ్చే ఎన్నికల్లో చిందనూరు నాగరాజు సమక్ష్యంలో బీఎస్పీ పార్టీ జెండా ఎగురవేస్తాం : రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్

రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రాయదుర్గంలో చిందనూరు నాగరాజు ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నారు. తమ నాయకులకు పార్టీ అండగా నిలుస్తుంది.. ఎవరు కూడా బెదిరింపులకు,కేసులకు భయపడకుండా పోరాటాలు కొనసాగించాలని పిలుపు

విశాలాంధ్ర - రాయదుర్గం : రాయదుర్గంలో తమ నాయకుడు చిందనూరు నాగరాజుకు ప్రాణహాని ఉందని రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి ఓ నాయకుడు తీసుకెళ్లాడు. స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు తమ పార్టీ జోలికొస్తే ఎవరిని వదిలేది లేదని హెచ్చరించారు. గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్ లో గల నేషనల్ ఫంక్షన్ హాల్ నందు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాయదుర్గం ఇంచార్జ్ చిందనూరు నాగరాజు అధ్యక్షతన ఎంతో ఆర్భాటంతో బహుజన సంకల్పన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ డిజిపి పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ,జిల్లా అధ్యక్షులు కాశని నాగరాజు,లాయర్ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయనప్ప, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా నాయకులను భారీ ఎత్తున జై భీమ్ జై భారత్ అంటూ నినాదాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ఆహ్వానించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ మాట్లాడుతూ రాయలసీమలో ఉన్నంత నిరుద్యోగం, నిరక్షరాస్యత, నిరుపేదరికం ఇంకెక్కడా లేవని, ఇక్కడి నుంచే చాలామంది ముఖ్యమంత్రులు, మంత్రులు వచ్చినా వారు ఈ ప్రాంతంలోని సామాన్య "రాష్ట్రంలోని మొత్తం 5.5 కోట్ల జనాభాలో దాదాపు 4.5 కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు. వీరికి పార్టీయే లేదు. కానీ అది రెడ్ల పార్టీ. బీసీలు టీడీపీ తమ పార్టీ అనుకుంటున్నారు. అది కమ్మవారి పార్టీ. సీపీఐ, సీపీఎం కూడా ఆ రెండు కులాలకు సంబంధించినవే. వాళ్లకు పార్టీలు ఉండబట్టి వాళ్లే కాంట్రాక్టులు తీసుకుంటున్నారు. పనులు చేసుకుని సంపాదించుకుంటున్నారు. ఎస్సీలకు గానీ, బీసీలకు గానీ, ముస్లింలకు గానీ న్యూస్‌పేపర్, ఛానల్ ఉన్నాయా? మనకంటూ ఒక పార్టీ లేనప్పుడు ఎమ్మెల్యే సీటు, కాంట్రాక్టులు ఏమీ రావు. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలకు అండగా ఇప్పుడు బీఎస్పీ ఉందన్నారు. గతంలో ప్రసాదరావు అనే ఎస్సీ ఐపీఎస్ అధికారి కాంగ్రెస్ హయాంలో డీజీపీ అయ్యారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆయనను తీసేశారు. తర్వాత రెండు వారాలు మాత్రమే సర్వీసు ఉన్న ఒక వ్యక్తిని డీజీపీగా చేసి, రెండు సంవత్సరాలు కొనసాగించారు. ఇంకా రెండు సంవత్సరాల సర్వీసు ఉన్న ప్రసాదరావును తీసేశారు. అందుకే మనకంటూ ఒక పార్టీ అండగా లేకపోతే ఎలాంటి పదవులు, ఉన్నతోద్యోగాలు ఉండవు. నేను పదవీవిరమణ చేసిన తర్వాత కుల నిర్మూలన గురించి అంబేడ్కర్ రాసిన ఎనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్ అనే పుస్తకం చదివాను. అప్పటినుంచి నా మనసు మనసులో లేదు. ఎందుకంటే, ఎన్ని పార్టీలు ఏం చెప్పినా ప్రజలకు అన్యాయమే జరుగుతోంది. రోజుకు రూ.500 కూడా గిట్టుబాటు కాని ఆదాయాలు ఉన్నాయి. దేశంలోని 140 కోట్ల జనాభాలో 100 కోట్ల మంది పరిస్థితి ఇలానే ఉందన్నారు. దీనికి పరిష్కార మార్గంగా నాకు కనిపించిన ఏకైక పార్టీ బహుజన సమాజ పార్టీ. బీఎస్పీ ఒక్కటే ఈ వంద కోట్ల మందికి న్యాయం చేయగలిగిన పార్టీ అని నాకు అర్థమైంది. గతంలో అధ్యక్షుడిగా పరంజ్యోతి చాలా అద్భుతంగా పనిచేశారు. అన్నివర్గాల వారినీ కలుపుకొని వెళ్లేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. బీసీ సంఘాలతో కలిశాం, కులగణన చేయాలన్న డిమాండు తీసుకొచ్చాం. కేంద్రం ఈ మధ్యే కులగణనకు ఒప్పుకొంది. బహుజన ఫోరం నారాయణప్ప ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటుపరం కాకుండా భారీ ఉద్యమమే చేశాం. 2వేల మందితో ధర్నా చేశాం. దాంతో తాత్కాలికంగా ప్రైవేటీకరణ ముప్పు నుంచి తప్పించుకుంది. యూత్ లీడర్ బందెల గౌతమ్ కుమార్ ఇప్పుడు పార్టీ అధ్యక్షుడయ్యారు. ఆయన నేతృత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాలనూ కలుపుకొని రాజ్యాధికారం లక్ష్యం కోసం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 32 మంది రెడ్డి ఎమ్మెల్యేల్లో 27 మంది ఇక్కడే రాయలసీమ, నెల్లూరులో కలిపి 63 అసెంబ్లీ స్థానాలున్నాయి. 9 పార్లమెంటు స్థానాలున్నాయి. ఈ 63 మందిలో రెడ్డి ఎమ్మెల్యేలే 27 మంది ఉన్నారన్నారు. మొత్తం ఏపీలో 32 మంది రెడ్డి ఎమ్మెల్యేలుంటే నెల్లూరు, రాయలసీమలోనే 27 మంది ఉన్నారు. అంబేద్కర్ పుణ్యమాని 11 మంది ఎస్సీ ఎమ్మెల్యేలున్నారు. కమ్మ ఎమ్మెల్యేలు 12 మంది ఉన్నారు. రాష్ట్రం మొత్తంలో 35 మంది కమ్మలు ఉంటే, ఇక్కడే 12 మంది ఉన్నారు. బీసీలు మాత్రం 8 మందే ఉన్నారు. రాష్ట్రంలో 8 మంది బీసీ మంత్రులుంటే అందులో నలుగురి భార్యలు లేదా భర్తలు కమ్మవాళ్లే ఉంటున్నారు. ఇలా మనకు ఇచ్చే కోటాలోనూ వారి ఆధిపత్యమే కనపడుతోంది. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి, సామాన్యుల గొంతుగా బీఎస్పీ నిలిచేలా బాధ్యతాయుతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, పార్టీ రాయలసీమ ఇన్‌ఛార్జి చిందనూరు నాగరాజు, అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడు కాసాని నాగరాజు,కుల్లాయప్ప, నాగమ్మ,హరి, రాయదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.కృష్ణ, నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు జయచంద్ర,కార్యదర్శి రాజు,ఉపాధ్యక్షులు తిప్పేస్వామి,మండల అధ్యక్షులుహనుమంతు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నాహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 వతేది నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఆమిద్యాల నుంచి పెన్నహోబిలానికి శ్రీవారి ఉత్సవమూర్తులను తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 10వ తేదీన ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం, 11 న సింహవాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం,12 న గోవాహనం మరియు శేష వాహనోత్సవాలు జరగనున్నాయి. 13న హంస వాహనోత్సవం, 14న హనుమంత వాహనోత్సవం, 15న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 16 న సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవం, 17 న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 18 న అశ్వ వాహనోత్సవం, 19 న ధ్వజారోహణం, శయనోత్సవం, 20 న ఉత్సవ విగ్రహాల పెన్నహోబిలం నుంచి

ఆమిద్యాలకు తరలి వెళ్లే కార్యక్రమాలు ఉంటాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఆలయ చరిత్ర... అనంతపురం-బళ్లారి రహదారి పక్కన పెన్నానదికి మూడు కి.మీల దూరంలో గిరిపై పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉంది. నరసింహస్వామి, లక్ష్మీదేవి స్వయంభులుగా వెలిశారు. ఈ క్షేత్రం పెన్నానది సమీపంలో ఉండటం, స్వామి వారి పాదముద్రిక కింది భాగాన బిలం ఉండటంతో పెన్నహోబిలంగా పిలవబడుతోంది. ఈ కొండపై పూర్వం ఉద్దాలక మహర్షి తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ గిరికి కింది భాగంలో తూర్పుదిశగా గొల్లపల్లి గ్రామం ఉండేది ఒక గోవు ప్రతిరోజూ బిలం వద్ద క్షీరం ఇచ్చేదని చెబుతారు. గోవు పొదుగులో పాలు లేకుండా ఉండడం గమనించి యజమాని కలత చెందుతుండ టంతో లక్ష్మీనరసింహస్వామి ఆయనకు అగుపించి తాను క్షీరాన్ని సేవిస్తున్నట్లు తెలుపగా అతడు సంతోషభరితుడై బిలం వద్దకు వెళ్లి శోధించినట్లు గ్రామస్థులు చెబుతారు. ఆ బిలంపై భాగాన స్వామి పాదముద్రికలు ఉన్న శిలాఫలకం, కింది నైరుతి స్థానంలో లక్ష్మీదేవి శిలలు అగుపించగా గ్రామస్థులు అప్పటి నుంచి పూజలు నిర్వహించినట్లు కథనం. సదాశివరాయలు ఆలయాలను నిర్మించినట్లు తెలుస్తోంది.

గాలి మల్లికార్జున మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-గుంతకల్లు : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి కార్యదర్శి కీర్తిశేషులు ఎమ్మెల్యే గాదిలింగప్పకి సన్నిహితులు.కీర్తిశేషులు గోపీనాథ్‌కి మాజీ ఉరవకొండ ఎమ్మెల్యేకి కూడా సన్నిహితులు ఎన్నో పోరాటాలు చేసి మంచి గుర్తింపు ఉన్న నాయకుడు అందులో ప్రధాన అంశాలు మిల్లు తెరవాలని ఎన్నో ఉద్యమాలు చేసి మిల్లు కార్మికుల కోసం నిరాహార దీక్షలు చేసిన వారికోసం బిక్షాటన చేసి వారికి సహాయ సహకారాలు అందించిన నాయకుడు అలాగే గుంతకల్లులో సోఫియా థామస్ అనే మహిళను హత్య చేస్తే హత్య చేసిన వారిని ఎవరైతే చేశారు.. వారిని పట్టుకొని శిక్షించాలని అప్పట్లో మంచి ఉద్యమం నడిపిన గొప్ప నేత చెప్పుకుంటూ పోతే ఆయన జీవితం మొత్తం పార్టీ కోసం ప్రజల కోసం పని చేసిన మహానుభావుడు అలాంటి మహానుభావుడు ఇవాళ మృతి చెందడం చాలా బాధాకరం కాంగ్రెస్ పార్టీకి

తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేయడమైనది. కాంగ్రెస్ పార్టీ గుంటకల్ పట్టణ అధ్యక్షులు ఎం మహేంద్ర, జిల్లా జనరల్ సెక్రెటరీ. ఆలం నవాజ్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ. ఫిరోజ్ ఖాన్,నబి, మైనార్టీ జిల్లా నాయకులు రసూల్, తదితరులున్నారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గాలి మల్లికార్జున మృతి కి సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బి.గోవిందు, సిపిఐ డివిజన్ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి బి మహేష్, రైతు కూలీ వ్యవసాయ సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర, సిపిఐ పట్టణ అధ్యక్షులు గోపీనాథ్, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, సంతాపం తెలియజేశారు. సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బి గోవిందు, సిపిఐ డివిజన్ కార్యదర్శి వీరభద్ర స్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని వారి అన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదలింగప్ప ఉరవకొండ ఎమ్మెల్యే గోపీనాథ్, వారి వెన్నంటూ ఉంటూ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి గా పనిచేసినటువంటి గొప్ప నాయకుడు ఎన్నో పోరాటాలు చేసి మంచి గుర్తింపు ఉన్న నాయకులు అని అన్నారు . ఆయన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వేసవి విజ్ఞాన శిబిరాల తనిఖీ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ మాట్లాడతూ విద్యార్థిని, విద్యార్థులు గ్రంథాలయాలకు విచ్చేసి విజ్ఞానాన్ని పొందాలని, చిన్నతనం

నుండి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో గల కథల పుస్తకాలు, పురాణాలు, కాంపిటీషన్ బుక్స్, సైన్స్, నవలలు, దినపత్రికలు, వార పత్రికలు చదవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా చర్చి స్కూలు ఉపాధ్యాయులు రాంబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్. వీరారెడ్డి, బి. వెంకట రమణప్ప, పెన్షన్ సంఘం అధ్యక్షులు సత్యప్రసాద్ గ్రంథాలయ అధికారి బి. రవికుమార్ నాయుడు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-బొమ్మనహాల్: బొమ్మనహాల్ మండలం నుండి అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి పిడిఎస్ బియ్యంను తరలిస్తుండగా అనంతపురం విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్సై గోపాల్ తెలిపిన వివరాల మేరకు కే ఏ 34 డి 2274 నెంబర్ గల బొలెరో వాహనంలో 74 బస్తాలు (37 క్వింటాల్ బియ్యం) అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని సింగనహళ్లి గ్రామ సమీపంలో సంగమేశ్వర దేవాలయం వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు లక్ష్మీకాంత్ నాయక్, ఆర్ఐ బాలకృష్ణ సమక్షంలో బియ్యంను పరిశీలించగా పిడిఎస్ బియ్యంగా గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్ బసవరాజు, బియ్యం వ్యాపారులు ఎల్లప్ప, రుద్రన్నలపై బొమ్మనహాల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ తెలిపారు.

ఉచిత ఖత్నా మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ పట్టణంలో ముస్లిం హిందూ సోదరులకు ఉచితంగా ఖాత్నా (కట్న)చేయడానికి ఎస్ ఎస్ బి హెల్త్ కేర్ సెంటర్ నందు మే 11వ తేదీన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఖాత్న క్యాంపును కనేకల్ మండలము బొమ్మనహాల్ మండలం ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ,ఆరోహి ఒక ప్రకటనలో తెలియజేశారు. బొమ్మనహాళ్ మండలం కనేకల్ మండలం ప్రజలు ఎస్ ఎస్ బి సెంటర్ నిర్వాహకు రాలు డాక్టర్, ఆరోహి హాస్పిటల్ చైర్మన్ షాకీర్ మరియు స్నేహితులు షేక్ గౌస్ పీర్ భాష , ఫజులుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న అమీనా ఆప్టికల్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం శాంతిరాం హాస్పిటల్ నంద్యాల వారి సహకారంతో నిర్వహించనున్నట్లు అమీనా ఆప్టికల్ షోరూం యజమాని సయ్యద్ గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని యాడికి మండల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9030880167 ను సంప్రదించాలన్నారు.

టైక్వాండో క్లాసులు ప్రారంభం

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణం నందు కరాటే టైక్వాండో జూడో మార్షల్ ఆర్ట్స్ క్లాసులు ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ హై స్కూల్ నందు ప్రారంభోత్సవం చేస్తున్నట్టు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాకే గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో ఇండియన్ బ్రూస్లీ భానుచందర్, హీరో సుమన్, విభిన్న సినిమాల ఫైట్ మాస్టర్ సాకే అశోక్ రాజు, విచ్చేయుచున్నారు వారి ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ నందు కరాటే శిక్షకులు అద్భుత విన్యాసాలను ప్రదర్శించడం జరుగుతుంది. కావున పామిడి ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులు ప్రజలు ఈ కార్యక్రమానికి తిలకించి సభ్యత్వం పొంది క్లాసుల్లో జాయిన్ అయి ఆత్మరక్షణలో శిక్షణ పొంది జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి అంతర్జాతీయ స్థాయి లో పతకాలు సాధించి మీ పేరును తల్లిదండ్రుల పేరును నలుమూలల వ్యాపించే చేయాలని కోరుతున్నాం . ఈ ట్రైనింగ్ ఇచ్చువారు జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినటువంటి మాస్టర్ విక్టర్ మరియు రాష్ట్రస్థాయి శిక్షకుడు ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని అన్నారు.